సాక్షి
గుంటూరు
ఆదివారం । 31 । ఆగస్టు । 2025



సివిల్ రైట్స్ డే

వినుకొండ: మండలంలోని వితంరాజుపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. తహసీల్దార్ సురేష్‌నాయక్ మాట్లాడారు.



గణపతికి కుంకుమ పూజ

తెనాలి: స్థానిక నందులపేటలో గణనాథునికి శనివారం భారీ సంఖ్యలో మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. దాదాపు రెండు వేల మంది పూజల్లో పాల్గొన్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి శనివారం 4,513 క్యూసెక్కులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 12 అడుగులు నీటి మట్టం ఉంది.

న్యూస్‌రీల్

భూ వివాదాలకు చెక్ పెట్టేందుకే 'నక్ష'



మంగళగిరి టౌన్: పట్టణాల్లో రెవెన్యూ రికార్డులను పక్కాగా అమలు చేయడానికి, భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబిటేషన్ (నక్ష) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంగళగిరి నగర అసిస్టెంట్ సిటీ ప్లానర్ అజయ్‌కుమార్ తెలిపారు. నక్ష పైలెట్ ప్రోగామ్‌లో భాగంగా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ ఏరియల్ సర్వేకు ఎంపికై ందని, ఇందులో భాగంగా భూ రీసర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూములకు సరిహద్దులు నిర్ధారించడంతోపాటు నక్ష పటాన్ని రూపొందిస్తామని అన్నారు. భూముల డిజిటలైజేషన్ ద్వారా సమగ్ర సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

అమరావతిలో నిమజ్జన సందడి



అమరావతి: జిల్లా నలుమూలల నుంచి కృష్ణా నదిలో నిమజ్జనానికి వినాయక విగ్రహాలు తరలిరావటంతో శనివారం అమరావతిలో సందడి నెలకుంది. ఒడ్డున పోలీస్‌శాఖ, ధరణికోట గ్రామ పంచాయతీ సమన్వయంతో నిమజ్జనోత్సవాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిగేందుకు చర్యలు చేపట్టారు. పోలీసు శాఖ గుంటూరు రోడ్డు నుంచి రింగ్ రోడ్డు మీదుగా ఆరుడొంకల బావి సెంటర్, ధ్యానబుద్ధ విగ్రహం వరకు కూడళ్లలో ప్రత్యేకంగా పోలీసులను ముందస్తు జాగ్రత్తగా నియమించారు. సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

జీజీహెచ్‌కు శరీర దానం



ఆవుల శ్రీనివాసరావు (ఫైల్)

నాదెండ్ల: గొర్రెల మందపై కారు దూసుకెళ్లిన ఘటనలో కాపరితో పాటు రెండు గొర్రెలకు తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి తెలిసిందే. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన పల్నాడు జిల్లా గణపవరం గ్రామానికి చెందిన ఆవుల శ్రీనివాసరావు(45) గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతని భార్య కరోనా సమయంలో మృతి చెందగా, కుమారుడు ఉన్నాడు. మృతుడి తండ్రి సాంబయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన కారును స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతిచెందిన శ్రీనివాసరావు భౌతికకాయాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సౌజన్య ఎంపిక

బాపట్ల జిల్లా నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయురాలు



బాపట్లటౌన్: బాపట్ల మండలం వెదుళ్లపల్లి పంచాయతీ వృక్షనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాతం సౌజన్య ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా 41 మంది ఎంపిక కాగా బాపట్ల జిల్లా నుంచి సౌజన్య ఒకరే ఎంపికయ్యారు. వీరికి సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించారు. తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సులభ రీతిలో విద్యాబోధన ఏవిధంగా చేయాలి, వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తే ఉపయోగం ఏవిధంగా ఉంటుందనే విషయాలను క్షుణ్ణంగా వివరించారు. జిల్లా నుంచి ఎంపికైన యాతం సౌజన్యను జిల్లా సర్వశిక్ష అభియాన్ అడిషనల్ డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. సౌజన్యను అభినందించిన వారిలో సమగ్ర శిక్ష లెక్చరర్ సతీష్‌రెడ్డి, పీఆర్‌వో కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, దుర్గావరప్రసాద్, అస్మిత, ఇస్మాయిల్ ఉన్నారు.

చదువులకు నిలయమైన చోట సామాజిక న్యాయం అటకెక్కింది.. సామాజిక వర్గం అందలమెక్కింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కూటమి నేతల 'పచ్చ'పైత్యం మరీ ఎక్కువైంది. అడ్డగోలుగా తమవారికి ఉద్యోగాలు ఇస్తూ విద్యావ్యవస్థనే అభాసుపాలు చేస్తున్నారు. నలుగురికీ ఆదర్శంగా ఉండాల్సిన వారే... నలుగురు నవ్వుకునేలా కులపిచ్చితో వ్యవహరిస్తూ వర్సిటీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నారు.



ఆచార్యా.. వేరెవరూ లేరయా!

- ఉద్యోగాలన్నీ వారికే అప్పగిస్తున్న తాత్కాలిక వీసీ
- నిబంధనలు విస్మరించి అడ్డగోలుగా పోస్టింగ్‌లు
- కొత్త వీసీ వచ్చేలోగా చక్కబెట్టేందుకు తాపత్రయం
- వర్సిటీలో చక్రం తిప్పుతున్న కూటమి నేతలు

ఏఎన్‌యూలో ఒకే సామాజిక వర్గీయులకు పెద్దపీట

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కులమతాలకు, ప్రాంతాలకు అతీతంగా విద్యను అందించాల్సిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 'పచ్చ'పాత పాలన నడుస్తోంది. సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తూ వర్సిటీలో అడ్డగోలు విధానాలు అమలు చేయడం విద్యా వ్యవస్థకు కళంకంగా మారింది. పవిత్ర విశ్వవిద్యాలయాన్ని గత ఏడాదిగా కూటమి పాలకులు అక్రమాలకు కేంద్రంగా మార్చారు. ఇన్‌చార్జి పాలనలో కో ఆర్డినేటర్ల నియామకం, నూటా ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఎంపిక, విశ్రాంత ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా ఒక సామాజిక వర్గం వారికే పెద్ద పీట వేయడం వంటివి దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. నూతన ఉపకులపతి నియామక కసరత్తు తుది దశలో ఉండగా... కూటమి సామాజిక వర్గానికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు కల్పించారు. అడ్డగోలు విధానాలతో విశ్వవిద్యాలయాన్ని పక్కదారి పట్టించారు. ఒక సామాజిక వర్గానికి చెందిన అధికారి, మరికొందరి తీరుతోనే వర్సిటీ వివాదాలకు కేంద్రంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జి వీసీ పాలన పక్కదోవ పట్టిందనే విమర్శలు వస్తున్నాయి.

అడ్డగోలుగా ఉద్యోగాలు

సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తామని ప్రభుత్వం చెబుతున్నా తమ సామాజిక వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ ఏఎన్‌యూలో పాలన సాగుతోంది. ఇన్‌చార్జి కులపతి హయాంలో ఒక సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులకు రూ. 60 వేల జీతం చెల్లించి తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వారందరికీ ఇతరత్ర సౌకర్యాలు కూడా అందించారు. మన వర్గం అంటూ ఒక నాన్ టీచింగ్ అధికారికి ప్రత్యేకంగా అదే సామాజిక వర్గం వ్యక్తితో కమిటీ వేసి జీతం పెంచారు. ఫార్మసీ కళాశాలలో ఒక ఉద్యోగానికి నోటిఫికేషన్ వేసి తమ వర్గం వారే అంటూ ఇద్దరిని ఎంపిక చేయడం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. నూతన వీసీ నియామక వేళ ఒక నాన్‌టీచింగ్ ఉద్యోగి భార్యకి ఒక సైన్స్ విభాగంలో, మరొకరి బంధువుకి ఉద్యోగాలు కేటాయించారు. పరీక్ష భవన్‌లో ఒక మహిళా ఉద్యోగికి అత్యంత వివాదస్పద అధికారి సిఫార్సుతో అవకాశం కల్పించారు. వయస్సు దాటిపోయిన వ్యక్తికి ఇంజినీరింగ్ విభాగంలో డ్రైవర్ పోస్టు కేటాయించారు.

ఏ విభాగంలో చూసినా...

గత ఏడాది పాలనలో ఏఎన్‌యూలో అన్నింటా ఒకే సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వడంతో విశ్వవిద్యాలయ ప్రతిష్ట మసకబారింది. కో ఆర్డినేటర్ల ఎంపికలో సామాజిక న్యాయం లేదని ఒక పాలక మండలి సభ్యుడు సమావేశంలో నిలదీశారు. నూటా ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని కోర్టుకు వెళ్లారు. కో ఆర్డినేటర్లుగా అవకాశం కల్పించిన వారందరికీ మూల్యాంకనంలో సీటీపీ విధులు కేటాయించారు. తమవారే అంటూ కో ఆర్డినేటర్లుగా ఒక ఎన్నికల్లో అభ్యర్థులుగా 60 మందిపైగా ఆచార్యులు ఉన్న దూర విద్య పరీక్షల్లో వారినే పరిశీలకులుగా రెండు దఫాలు నియమించారు. ఒక అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అనేక ఆరోపణలు వచ్చినా, ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లినా అడిగే నాథుడే లేరు. ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలతో యూనివర్సిటీని వివాదాల్లోకి లాగారు.

లాటరీ విధానంలో బార్‌లు కేటాయింపు



బార్లకు లాటరీ తీసున్న జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: గుంటూరు జిల్లాలో బార్ల లైసెన్సులకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో షేక్ ఖాజావలి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీసీ కె.శ్రీనివాసులు, ఈఎస్ వి.అరుణ కుమారితోపాటు దరఖాస్తుదారులు హాజరయ్యారు. వారి సమక్షంలో జేసీ లాటరీ ద్వారా కేటాయించారు. జిల్లాలో మొత్తం 110 బార్లకుగాను కేవలం 42 బార్లకు సంబంధించి 171 దరఖాస్తులు వచ్చాయి. గుంటూరు మున్సిపల్ పరిధిలో 73కుగాను 32కు తెనాలిలో 17కుగాను 2, మంగళగిరిలో 17కుగాను 2, పొన్నూరులో 3 కుగాను కేవలం ఒక్క దరఖాస్తు వచ్చింది. గీత కార్మికులకు కేటాయించిన 10 బార్లకు మొత్తం 73 దరఖాస్తులు వచ్చాయి. వ్యాపారులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. దరఖాస్తుకు రూ.5.10 లక్షలు ఏంటని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం వ్యాపారం గురించి టడీపీ విమర్శించిందన్నారు. ఇప్పుడు అంతకంటే దారుణంగా అటు మద్యం వ్యాపారులను, ఇటు ప్రజలను దోచుకుంటుందని విమర్శించారు. ఇటీవల మద్యం దుకాణాల వేలంలో రూ.వేల కోట్లు దండుకున్న ప్రభుత్వం బార్లను కూడా వదలడం లేదు.

సంజీవయ్యనగర్ రైల్వే గేటు మూసివేత



పైపులైన్ పనుల కారణంగా రైల్వే గేటు మూసివేసిన దృశ్యం

నెహ్రూనగర్: సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్ పనుల నిమిత్తం వచ్చే నెల 2వ తేదీ సాయంత్రం వరకు రైల్వే గేటు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్‌ఎల్‌ఆర్ (లక్ష్మీపురం) రిజర్వాయర్‌కు తాగునీటిని సరఫరా చేసే 900 ఎంఎం డయా పైపులైన్‌కు నెహ్రూనగర్ పంప్ హౌస్ వద్ద, సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద ఇంటర్ కనెక్షన్ పనులు జరగనున్నాయి. ఇవి ఆదివారం నుంచి 2వ తేదీ సాయంత్రం వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గేటు మీదుగా రైల్వే అధికారుల సహకారంతో రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. 2వ తేదీ సాయంత్రం ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తయిన తరువాత గేటు తీస్తామని పేర్కొన్నారు.

'సహకార' సమరానికి సిద్ధం

తెనాలి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. షెడ్యూలును ప్రకటించారు. బ్యాంక్ పాలకవర్గ ఎన్నికల్లో ఈ సారి టీడీపీ తరఫున ఇంకా అభ్యర్థులను నిర్ణయించలేదు. ప్రస్తుత చైర్మన్ మళ్లీ ఎన్నికయేలా ఏకగ్రీవం చేసేందుకు యత్నిస్తున్నారు. ఈసారి పోటీ అనివార్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి పార్టీల్లో ఒకటైన జనసేన, ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎలాంటి వ్యూహం అనుసరిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

- తెనాలిలో కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు ఏర్పాట్లు
- పోటీ అనివార్యమయ్యేలా పరిస్థితులు

తెనాలి: రాష్ట్రంలో సహకార చట్టం వచ్చాక తొలిగా తెనాలిలో ఏర్పాటైన అర్బన్ బ్యాంక్ ఇది. ఏర్పడి శతాబ్దం దాటినా ఇప్పటికీ ఎదుగూ బొదుగూ లేకుండా ఒకే శాఖతో ఉంది. బ్యాంక్ ఎన్నికలు వచ్చే నెల 14న నిర్వహించాలని నిర్ణయించారు. 12 మంది పాలకవర్గ సభ్యుల ఎన్నికను రహస్య బ్యాలెట్లో నిర్వహించనున్నారు. సెప్టెంబరు 7వ తేదీన ఉదయం బ్యాంక్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తారు. 8న పరిశీలన, 9న ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదేరోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. సాయంత్రం ఎన్నికల చిహ్నాల కేటాయింపు ఉంటుంది. 14న ఉదయం 7 – మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నిక నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుంది. ఎన్నికల అధికారిగా కో ఆపరేటివ్ సొసైటీ విశ్రాంత అసిస్టెంట్ రిజిస్ట్రార్ వ్యవహరిస్తారు. ప్రస్తుతం బ్యాంక్ పాలకవర్గం త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న మంగమూరి హరిప్రసాద్ మూడోసారి చైర్మన్‌గా ఎన్నికయ్యేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు సమాచారం.

ఎమ్మెల్సీ మద్దతు?

ప్రస్తుత చైర్మన్ నివాసానికి దగ్గర్లోని మారీసుపేటలో గల ఎన్‌సీఆర్‌ఎం హైస్కూలులో ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూలును కనీసం సభ్యులకు కూడా తెలియపరచలేదు. ఒకే పత్రికకు సమాచారం ఇచ్చారు. టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా పార్టీ తరఫున బ్యాంక్ చైర్మన్ అభ్యర్థిని ప్రకటించలేదని అంటున్నారు. ఆయన మద్దతు హరిప్రసాద్‌కేనన్న వాదన వినిపిస్తోంది. దీంతో అభ్యర్థిని రంగంలోకి దింపే ఆలోచనలో ఆలపాటి రాజా వ్యతిరేక వర్గం ఉందని విశ్వసనీయ సమాచారం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యేకాధికారి పాలనలో ఉన్న అర్బన్ బ్యాంక్‌కు ప్రభుత్వం ద్వారా త్రీమెన్ కమిటీని నియమించారు. అప్పుడు టీడీపీ నాయకులు ఆ కమిటీ నియామకంపై కోర్టును ఆశ్రయించారు. ఎన్నికలను నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. దీంతో ఆ కమిటీ రద్దయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ త్రీమెన్ కమిటీని నియమించుకున్నారు. దీనిపై మళ్లీ కోర్టును ఆశ్రయించటంతో ఎన్నిక అనివార్యమైందని చెబుతున్నారు. కూటమి పార్టీల్లో ఒకటైన జనసేన పీఏసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ఏ నిర్ణయం తీసుకుంటారు? ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎలాంటి వైఖరిని ప్రదర్శిస్తారనే చర్చ పట్టణంలో నడుస్తోంది.



కొత్తపేటలోని కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్

ఐదు వేల మందికిపైగా ఓటర్లు

బ్యాంకుకు 5 వేల మంది ఓటర్లు వరకు ఉన్నారు. గతంలో పాలకవర్గాలు ఇష్టారాజ్యంగా ఓటర్లను చేర్పించాయి. బ్యాంకు పరిధిలో కాకుండా కొల్లిపర, వేమూరు నియోజకవర్గానికి చెందిన వ్యక్తుల ఓట్లు ఉన్నాయి. మరికొందరు ఓటర్లకు సంబంధించి పేర్లు ఉన్నప్పటికీ చిరునామాలు లేవు. ఇలాంటి అవకతవకల జాబితా సవరించిందీ లేనిదీ తెలియదు. ఇదే జాబితాలో ఎన్నిక నిర్వహించటంపైనా విమర్శలు వస్తున్నాయి.

బరిలో సీనియర్ టీడీపీ నేత

టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ చైర్మన్ పదవికి పోటీపడనున్నారు. ఈ విషయాన్ని ఆయన శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. గత పదిహేనేళ్లగా ఒకే వ్యక్తి అధికారంలో కొనసాగుతున్నారని చెప్పారు. రమేష్ రంగప్రవేశంతో అర్బన్ బ్యాంక్ ఎన్నిక రసవత్తరం కానుంది.

నిమజ్జన వేడుకలో వివాదం

- ఇరువర్గాల ఘర్షణతో గాయపడిన పది మంది
- తెనాలి డీఎస్పీ, సీఐ, పలువురు పోలీసులకూ తప్పని గాయాలు

సుద్దపల్లి (చేబ్రోలు): వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా జరిగిన ఊరేగింపులో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో పదిమందికి గాయాలయ్యాయి. వివరాలు... సుద్దపల్లి గ్రామంలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారు నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన వారి ప్రాంతంలోకి ఊరేగింపు చేరగానే వివాదం ఏర్పడింది. సినీ హీరో పాట సందర్భంగా యువకుల నృత్య ప్రదర్శనతో మరింత వేడి రాజుకుంది. స్థానికులు అడ్డుకోవటంతో విగ్రహం వెంట ఉన్న వారు దాడి చేశారు. మైలా శ్రీనివాసరావు, మరో వ్యక్తికి గాయాలయ్యా. ఊరేగింపును స్థానికులు అడ్డుకున్నారు. వివాదం ముదరడంతో టీడీపీకే చెందిన ఇరువర్గాలకు చెందిన వారికి నచ్చజెప్పడానికి మండల పార్టీ నాయకులు వచ్చారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. పోలీసులు సర్దిచెప్పటంతో ఊరేగింపు అర్ధరాత్రి సమయంలో ముందుకుసాగింది.

పోలీసు అధికారులకూ గాయాలు

ఇంతలో ఒక వర్గానికి చెందిన వారు ప్రధాన రహదారిపై రాళ్లు, తాడి బొత్తలు అడ్డుపెట్టారు. వాటిని తొలగించటానికి తెనాలి డీఎస్పీ జనార్దనరావు, పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ వీర నారాయణ తదితరులు వెళ్లారు. అక్కడ దూరం నుంచి కొంత మంది యువకులు ఆగ్రహంతో క్యాట్‌బెల్‌తో గోలీలు పెట్టి దాడి చేశారు. అర్ధరాత్రి సమయంలో ఎక్కడ నుంచి రాళ్లు, గోలీలతో దాడి చేస్తున్నారో అర్థం చేసుకునే లోపే స్థానికులకు, పోలీసులకు గాయాలయ్యాయి. డీఎస్పీ ముఖానికి రక్త గాయమైంది. సీఐ కోటేశ్వరావుకు తల భాగంలో, ఎస్ఐ వీరనారాయణ మరియు సిబ్బందికి గాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన పది మంది గాయపడ్డారు. తెనాలిలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. అందరూ టీడీపీ వారు కావడంతో కేసు నమోదులో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అలసత్వమే కారణం

సుద్దపల్లి గ్రామంలో కొద్ది రోజుల క్రితం రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడ్డారు. ఇప్పటి ఘర్షణకు కారణం కూడా అదేనని సమాచారం. పోలీసుల అలసత్వం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవటమే మళ్లీ ఘర్షణకు దారితీసింది. నాలుగు రోజుల క్రితం గొడవర్రు గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన వారు దాడులు చేసుకున్నారు. ప్రస్తుతం సుద్దపల్లిలో ఈ తరహా దాడులు జరిగాయి.

నల్సా పథకాలపై అవగాహన ముఖ్యం

గుంటూరు లీగల్: ప్రతి పౌరుడికి విధులతోపాటు చట్టాలపై అవగాహన ముఖ్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా పరిపాలనా శాఖ సమన్వయంతో కలెక్టరేట్ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నల్సా పథకంపై న్యూ మాడ్యూల్ క్యాంపును శనివారం జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు సమర్థ విధానాల అమలు, మానసిక రోగులకు న్యాయ సేవలు, దివ్యాంగులకు పథకాలపై వివరించారు. అర్హత కలిగిన వారు ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చని తెలిపారు. నాలుగవ అదనపు జిల్లా జడ్జి, స్పెషల్ ట్రయిల్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ (గుంటూరు) ఆర్. శరత్ బాబు మాట్లాడుతూ నల్సా పథకాలను అణగారిన వర్గాలకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో రూపొందించారన్నారు. ఒకటవ అదనపు జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి మాట్లాడుతూ అణగారిన వర్గాల వారికి నల్సా పథకాలపై అవగాహన లేకపోవడంతో ఆర్థిక, న్యాయ పరమైన సహాయం పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ బాధితులకు అందే న్యాయ సహాయాలు గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి వెల్లడించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వి. విజయలక్ష్మి కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 108 మందికి రూ. 71 లక్షలతో నాలుగు ఆటోలను, దివ్యాంగులకు హియరింగ్ కిట్, ఫోను, వీల్ చైర్లను జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శివ సూర్యనారాయణ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ప్యానెల్ అడ్వకేట్‌లు, పారా లీగల్ వలంటీర్స్, మీడియేషన్ అడ్వకేట్‌లు, అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

రాజధాని రైతుల భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కమిషనర్ కన్నబాబు

గుంటూరు వెస్ట్: అమరావతి రాజధాని పరిధిలోని రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. శనివారం గుంటూరు కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహాతో కలిసి నిర్వహించిన సమావేశంలో కన్నబాబు మాట్లాడుతూ రైతులు అధికారుల దృష్టికి తీసుకొస్తున్న ఇబ్బందులను ఒక పోర్టల్‌లో ఉంచి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

ఆర్‌బీకేల ద్వారా యూరియా సరఫరా చేయాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి




యూరియా కొరతపై నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియాను రైతులకు సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద కౌలు, రైతు సంఘాల నాయకులతో కలసి యూరియా కొరతపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కృత్రిమంగా యూరియా కొరత సృష్టించి, రైతాంగాన్ని ఇబ్బందులు పాలు చేస్తోందని అన్నారు. ఎరువులపై ఇచ్చే సబ్సిడీ తగ్గించేందుకు, విదేశాల నుంచి దిగుమతి చేసుకోకుండా యూరియాను కృత్రిమ కొరత సృష్టించడం, రైతులను మోసం చేయడమేనని అన్నారు. జొన్న, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ వంటి పంటలు వేసిన రైతులకు యూరియా తక్షణమే అవసరం ఉందన్నారు. తక్షణమే యూరియాను అందుబాటులో తీసుకువచ్చి రైతులకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులపై చిత్తశుద్ధి ఉంటే నానో యూరియాను కాకుండా రైతులు కోరే యూరియాను సరఫరా చేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు, రైతు సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, హేమలత, ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు, రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్, జిల్లా నాయకులు కాజా వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారమూ పెద్ద ప్రహసనమే!

కూటమి ప్రభుత్వం వచ్చాక సాహిత్య, కళా రంగాల్లో అవార్డుల ప్రకటన కూడా ప్రహసనంగా మారింది. ఎంపికకు నిర్దిష్ట ప్రక్రియ, విధివిధానాలు లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులను గౌరవించటం మాట అలా ఉంచి, అవమానకరంగా వ్యవహరిస్తోందని ఆవేదన చెందుతున్నారు. పక్షపాతం, రాజకీయ జోక్యంతోపాటు అవార్డుల ప్రదానానికి కొద్ది గంటల ముందు వరకు రహస్యంగా ఉంచటం, రాత్రి పొద్దుపోయాక ఫోను సమాచారం ఇవ్వటం వలన ప్రదానోత్సవ సభకు సంబంధిత ప్రముఖులు వెళ్లలేని నిస్సహాయ పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- నిర్దిష్ట ప్రక్రియ, విధివిధానాలకు మంగళం
- రాజకీయ వైఖరిపై ఆరా తీశాకనే ఎంపిక
- అవార్డు ప్రదానానికి కొన్ని గంటల ముందు ఫోనులోనే సమాచారం
- దూరాభారంతో ఎంపికైన వారూ వెళ్లలేని దైన్యం



తెనాలి: సాహిత్య, కళారంగాల్లోని ప్రముఖుల కృషికి తగిన గుర్తింపునిచ్చి ప్రభుత్వం తరపున అవార్డులతో ప్రోత్సహించడం సంప్రదాయంగా వస్తోంది. రచయితలు, కళాకారులు ఆయా రంగాల్లో వారు చేసిన కృషి సామాజిక వికాసానికి, పురోగమనానికి దోహదపడే స్థాయిని అనుసరించి పురస్కారాలకు ఎంపిక చేస్తుంటారు. ఇందుకోసం గతంలో గౌరవప్రదమైన విధివిధానాలుండేవి. ఆయా రంగాలకు చెందిన ప్రభుత్వ సంస్థలు, సలహా సంఘాలు పనిచేసేవి. సాహిత్య, కళాప్రక్రియల్లోని విశిష్ట రచనలు, ప్రదర్శనలను పరిశీలించి అర్హులను గుర్తించి గౌరవ పురస్కారాలను అందజేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉగాది, కళారత్న, కందుకూరి వీరేశలింగం, గిడుగు రామమూర్తి, గుర్రం జాషువా పురస్కారాలు ఈ కోవలోనివి.

రాజకీయ జోక్యం

ఈ పురస్కారాల ప్రదానం కోసం రచయితలు, కళాకారులు, భాషాప్రముఖుల ఎంపికలో పక్షపాతం చూపుతోంది కూటమి సర్కారు. వారి సృజన, కృషి, సేవలు వంటివి పక్కకు పోయాయి. ప్రభుత్వం రాజకీయ అంశాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రతిభావంతులైన రచయితలు, కళాకారుల రాజకీయ భావజాలాన్ని, వారి రాజకీయ కార్యాచరణను అధికార పార్టీ కిందిస్థాయి రాజకీయ కార్యకర్తల ద్వారా విచారణ చేయిస్తోంది. అక్కడక్కడా రచయితలు, కళాకారుల ఇళ్లకు వెళ్లి ఇంటర్వ్యూలతో ఆయా వివరాలను సేకరిస్తున్నారు. తర్వాతనే అవార్డులకు ఎంపిక చేస్తున్నారు.

ఇవిగో నిదర్శనాలు...

ఇంతకుముందు ఉగాది/కళారత్న అవార్డుల ఎంపిక ప్రక్రియల్లో తెనాలికి చెందిన ప్రముఖ కళాకారిణిని అవార్డుకు ఎంపిక చేశారు. ఆమె తండ్రి ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుడనే కారణంగా చివరి నిమిషంలో రద్దు చేసినట్టు అప్పట్లో బహిరంగంగానే విమర్శలొచ్చాయి. అలాగే శుక్రవారం ప్రదానం చేసిన భాషా అవార్డుల విషయంలోనూ ఇదే తీరు కొనసాగింది. రాత్రివేళ ఫోన్లు చేసి, 'మీరు ఫలానా కదా! మీ రాజకీయ వైఖరి ఏంటి' అంటూ విచారించినట్టు సమాచారం. పురస్కారానికి ఎంపికైనట్లు చెప్పి, వెంటనే రావాలని ఫోనులో సమాచారం చేరవేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో దూరప్రాంతాల వారు కొందరు అవార్డులను స్వయంగా స్వీకరించలేకపోతున్నారు. ఉగాది/కళారత్న అవార్డులనే కాదు... శుక్రవారం భాషా దినోత్సవ అవార్డుల కార్యక్రమంలోనూ ఇదే పరిస్థితి. రాలేని వారు సంబంధిత కార్యాలయం నుంచి తర్వాత స్వీకరించాలని చెబుతున్నారట!

నేతల సిఫార్సులు

తాము చేసిన రచనలు, కళలు, కళారూపాల గురించి ప్రముఖులే ఏకరువు పెట్టుకోవాల్సి వస్తోంది. ఆశావహులు తమ దరఖాస్తులకు సంబంధిత ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సు లేఖలను జత చేయిస్తున్నారు. రచయితలకు రచనా ప్రక్రియల్లో, నాటక, నృత్య, సంగీత విభాగాల్లో సంబంధిత ప్రముఖులకే పురస్కారాలను ప్రదానం చేయాలనేది అందరి భావన.

పాఠశాలలకు బహుమతులు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్–2025కు ఎంపికైన ఐదు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అభినందించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత పాఠశాలల హెచ్‌ఎం, ఫిజికల్ డైరెక్టర్లను శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఎంపికైన వాటిలో ప్రథమ స్థానంలో మంగళగిరి మండలం నవులూరు జెడ్పీ హైస్కూల్, తరువాతి స్థానాల్లో వట్టిచెరుకూరు మండలం పల్లపాడు, మంగళగిరి మండలం నూతక్కి, పెదకాకాని మండలం ఉప్పలపాడు, చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలు నిలిచాయి, కార్యక్రమంలో గుంటూరు ఆర్ఐపీఈ మహబూబ్ బాషా, ఏపీ పీఈటీ, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కరీముల్లా చౌదరి, గుంటూరు జిల్లా కార్యదర్శి సీహెచ్ కొండయ్య, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవి పాల్గొన్నారు.

ప్రగతి పనులపై నిరంతర సమీక్షలు

– కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ పరిధిలో ప్రారంభమైన అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో నిరంతర సమీక్షలు నిర్వహించి మరింత వేగంగా పూర్తి చేసేందుకు యత్నిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, అధికారులతో రైల్వే ప్రాజెక్టులు, హౌసింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ న్యూ గుంటూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. పెదకాకాని ఆర్వోబీ నిర్మాణాలకు సంబంధించి కొన్ని ఇబ్బందులున్నాయని తెలిపారు. స్థానికంగా ఉండే కొన్ని ఇళ్లు తొలగించాల్సి ఉంటుందని, వారి అంగీకారం లభించిన వెంటనే పనులు వేగం పెంచుతామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, డీఆర్వో షేక్ ఖాజావలి, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రైల్వే ఆర్‌డీఎం సుదేశ్నసేన్, గతి శక్తి డిప్యూటీ సీఈ నోయల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

2.2 కిలోల సరుకు స్వాధీనం

లక్ష్మీపురం: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు నగరంపాలెం సీఐ ఎం.నజీర్‌బేగ్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ క్వార్టర్స్ వెనుక ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరిలో తండ్రి, కొడుకులు చెడు వ్యసనాలకు బానిసలై గంజాయి విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు. పల్నాడు జిల్లా మాచర్ల ప్రాంతం నుంచి గంజాయి తెచ్చి గుంటూరు నగరంలో విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఇద్దర్ని అరెస్టు చేశామని, వారి నుంచి కొనుగోలు చేస్తున్న నలుగురు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నామని వివరించారు. 2.2 కేజీల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



ఎనిమిది మండలాల్లో స్వల్ప వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో స్వల్ప వర్షం పడింది. ప్రత్తిపాడు మండలంలో 6.4 మిల్లీ మీటర్లు, ఫిరంగిపురం 3.2, తాడేపల్లి 3.2, దుగ్గిరాల 2.8, మంగళగిరి 2, తాడికొండ 2, పొన్నూరు 0.6, మేడికొండూరు మండలంలో 0.4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.

నేడు అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని త్రీమెన్ కమిటీ సభ్యులు యు.మహతీ శంకర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలను ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకల గుంట క్రీడా మైదానంలో ఏర్పాటు చేశామన్నారు. సెప్టెంబర్ 1, 2011 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. జనన ధ్రువీకరణపత్రంతోపాటు ఆధార్ తీసుకురావాలని తెలిపారు.

'ప్రకృతి' పంటలకు అదనపు ధర

ఫిరంగిపురం: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలకు పదిశాతం అదనపు ధర లభించేలా చూస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ అధికారి కె.రాజకుమారి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలకు అదనపు ధర రైతు కల్పించేలా అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. రాజకుమారి మాట్లాడుతూ రసాయన రహితమైన ఆకుకూరలు, కూరగాయలు పోషక విలువలతో కూడుకున్నవని చెప్పారు. వీటిని వినియోగదారులకు నేరుగా అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. రైతు నుంచి వాటిని కొనుగోలు చేస్తూ ప్రతి కిలోకు రూ.10 అదనంగా చెల్లిస్తామని చెప్పారు. ఏఓ వాసంతి, వీఏఏ రాంబాబు, ఎన్‌ఎఫ్ఏ సుమ, అమీనాబాద్, 113.తాళ్లూరు, మునగపాడు, తక్కెళ్లపాడు, హౌస్ గణేష్‌పాడు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాలువలో మునిగి బాలుడి మృతి

దుగ్గిరాల: మండల పరిధిలోని రేవేంద్రపాడు గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ (14) సరదాగా ఈతకి అని వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో మునిగి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... శనివారం మధ్యాహ్నం పాఠశాల నుంచి వచ్చిన ఇమ్రాన్ తన స్నేహితులతో కలసి ఈతకు వెళ్లాడు. ప్రవాహ ఉద్ధృతికి గల్లంతయ్యాడు. స్నేహితులు ఊళ్లోకి వెళ్లి విషయం చెప్పగా తల్లిదండ్రులు వచ్చారు. బాలుడిని వెలికితీసి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.